క్లుప్తంగా...

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



మేడ్చల్: పట్టణంలోని 17వ వార్డులో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్ ప్రారంభించారు. రూ.5 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. మంత్రి మల్లారెడ్డి నిధులతో వార్డులో సంపూర్ణ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 16వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి గురువారం ప్రారంభించారు. అలాగే 11వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ మల్లేశ్‌తో కలిసి ప్రారంభించారు. మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై గాంధీ విగ్రహానికి వినతి



ఘట్‌కేసర్‌లో గాంధీ విగ్రహానికి వినతి అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కార్మికులు

ఘట్‌కేసర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె గురువారంతో 28 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సమ్మెకు సంఘీభావం తెలిపి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం కార్మికుల సమస్యలపై గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మున్సిపల్ పాలకవర్గం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు తెలిపారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు పలు వార్డుల్లో సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్, జేఏఓ ప్రణతిరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నత విద్యకు ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న సామల యాదిరెడ్డి

పోచారం: అన్నానగర్‌కు చెందిన విద్యార్థి గుండెబోయిన శ్రీనివాస్ ఉన్నత విద్యనభ్య అభ్యసించేందుకు ఎస్‌వైఆర్ ఫౌండేషన్ రూ.35 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సామల యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. పదో తరగతి వరకు అంజనీ స్కూల్‌లో చదువుకున్న శ్రీనివాస్ ఇంటర్మీడియట్‌ను ఫౌండేషన్ సహకారంతో అభ్యసించారన్నారు. ఇతను అమెరికాలోని ఫ్లోరిడాలో ఎంఎస్ సివిల్ ఇంజినీరింగ్ చదవనున్న సందర్భంగా ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు సామల బుచ్చిరెడ్డి, సామల కొండల్‌రెడ్డి, మెట్టు శ్రీకాంత్‌రెడ్డి, విద్యార్థి తల్లి సత్యమ్మ తదితరులు ఉన్నారు.

హరితహారంపై ప్రత్యేక దృష్టి..!

ఈ ఏడాదిలో హరితహారం లక్ష్యం 63.90 లక్షల మొక్కలు

- జిల్లాలో ఇప్పటి వరకు నాటిన మొక్కలు 8 లక్షలు మాత్రమే
- నిర్లక్ష్యం చేసిన శాఖలు, పురపాలికలపై చర్యలకు సన్నద్ధం
- విస్తారంగా వర్షాలు.. మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందడుగు



గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్న మహిళలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో తొమ్మిదో విడత హరిత హారంలో మొక్కలు విరివిగా నాటేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లతో సహా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో వీలైనన్ని మొక్కలు నాటేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక పాంతాలలో కూడా మొక్కలు నాటేందుకు కార్యాచరణ ఖరారు చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాది 63.90 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. సామూహిక వనాల పెంపకానికి స్థల సేకరణలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు.

నర్సరీల్లో 68 లక్షల మొక్కలు...

జిల్లాలో లక్ష్యానికి తగ్గట్టుగా అటవీ శాఖ తూముకుంట, కండ్లకోయ, దూలపల్లి ప్రాంతాల్లోని మూడు నర్సరీల్లో 8 లక్షల మొక్కలను పెంచగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) ఆధ్వర్యంలో 59 గ్రామాల్లోని నర్సరీల్లో 30 లక్షల మొక్కలు, 13 పురపాలక సంఘాల పరిధిలోని నర్సరీల్లో మరో 30 లక్షల మొక్కలను పెంచారు. ఈ ఏడాది గతంలోని మొక్కలతో పాటు టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నాటిన మొక్కలు 8 లక్షలకు పైనే...

మేడ్చల్ జిల్లాలో ఈ ఏడాది హరితహారంలో భాగంగా 63.90 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా అధికార యంత్రాంగం నిర్ణయించినా, ఇప్పటి వరకు 8,19,496 మొక్కలను మాత్రమే నాటారు. 61 గ్రామ పంచాయతీల్లో 12 లక్షల మొక్కల లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 3,06,562 మొక్కలను నాటారు. హరితహారంలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటుతున్న వాటి జాబితాలో ఘట్కేసర్, కీసర, ఎంసీపల్లి, శామీర్‌పేట్, మేడ్చల్ మండలాల్లోని గ్రామ పంచాయతీలతోపాటు పరిశ్రమలు, మైనింగ్, అగ్రికల్చర్, మేడ్చల్ ఎక్సైజ్, అటవీ శాఖలు ఉన్నాయి. అలాగే.. పీర్జాదిగూడ, నిజాంపేట, మేడ్చల్, పోచారం, దుండిగల్, దమ్మాయిగూడ, కొంపెల్లి పురపాలక సంఘాల్లో కూడా మొక్కలు నాటుతున్నారు.

హరితహారంపై నిర్లక్ష్యంతో...

జిల్లాలో హరితహారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆయా ప్రభుత్వ శాఖలు, పురపాలక సంఘాలపై శాఖ పరమైన చర్యలకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. హరితహారంలో భాగంగా ఇప్పటి వరకు మొక్కలు నాటని జాబితాలో బోడుప్పల్, జవహర్‌నగర్, తూముకుంట, ఘట్కేసర్, నాగారం, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘాలతో పాటు మల్కాజిగిరి ఎక్సైజ్‌శాఖ, స్కూల్, కాలేజీ ఎడ్యుకేషన్స్, హార్టికల్చర్, ఐసీడీఎస్, ఇరిగేషన్, మత్స్య, సంక్షేమ శాఖలు ఉన్నాయి.

మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు



- కలెక్టర్ అమయ్‌కుమార్ సమక్షంలో లక్కీడ్రా
- జిల్లాలో మొత్తం షాపులు 202
- గౌడలకు 23, ఎస్సీలకు 12, ఎస్టీలకు ఒకటి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజగిరి జిల్లాలో 2023–25 సంవత్సరానికి సంబంధించి నూతన మద్యం పాలసీ ప్రకారం మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు చేయడానికి జిల్లా ఆబ్కారీ శాఖ లక్కీ డ్రా నిర్వహించింది. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అధ్వర్యంలో లక్కీ డ్రా కార్యక్రమాన్ని పారదర్శకంగా జిల్లా ఎక్సైజ్ శాఖ చేపట్టింది. రాష్ట్ర ఎక్సైజ్ పాలసీ ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి మేడ్చల్ జిల్లాలో మద్యం దుకాణాలను ఎస్టీ, ఎస్సీ, గౌడలకు రిజర్వు చేయడానికి లాటరీ ద్వారా కేటాయించినట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఎక్సైజ్ పాలసీ ప్రకారం గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్ల ప్రాతిపదికన మద్యం దుకాణాల కేటాయింపులు జరిపినట్లు పేర్కొన్నారు. మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 202 మద్యం షాపులు ఉండగా, గౌడలకు 23, ఎస్సీలకు 12, ఎస్టీలకు 2 మద్యం షాపులను కేటాయించారు. ఇందులో మేడ్చల్ ఎక్సైజ్ శాఖ పరిధిలో 114 మద్యం దుకాణాలు ఉండగా, గౌడలకు 11 మద్యం దుకాణాలు, ఎస్సీలకు 5 దుకాణాలు, ఎస్టీలకు ఒకటి చొప్పున దక్కాయి. అలాగే మల్కాజిగిరి ఎక్సైజ్ శాఖ పరిధిలో 88 మద్యం దుకాణాలు ఉండగా, గౌడలకు 12 దుకాణాలు, ఎస్సీలకు 7 దుకాణాలు, ఎస్టీలకు ఒక దుకాణం రిజర్వు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, ఆర్డీవోలు రాజేష్ కుమార్, శ్యామ్‌ప్రకాశ్, జిల్లా బీసీ సంక్షేమాధికారి కేశురామ్, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి వినోద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమస్యలుంటే ప్రజలు నేరుగా రావాలి



మేడ్చల్ తహసీల్దార్ శైలజ

మేడ్చల్: ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తమ కార్యాలయానికి వచ్చి తమకు సమస్యలను విన్నవించుకుంటే పరిష్కరించడానికి కృషి చేస్తామని మేడ్చల్ తహసీల్దార్ శైలజ అన్నారు. తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న అనంతరం తహసిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి పైరవీలకు పైరవీకారులకు తమ కార్యాలయంలో తావు లేదని, ప్రజలు తమ శాఖలో ఎలాంటి సమస్యలున్నా నేరుగా తెలియజేయాలని కోరారు. తహసీల్దార్‌గా సాధ్యమైనంత వరకు ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎలాంటి ఒత్తిడులకు లోనుకోకుండా పనిచేస్తానని అన్నారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి మార్గం చూపుతానని అన్నారు. రెవెన్యూ శాఖ తరపున ప్రజలకు ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రతి పథకాన్ని ప్రజల వద్దకు చేరుస్తానని ఆమె తెలిపారు. ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తానని అన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ



అవుషాపూర్‌లో గొర్రెల పంపిణీని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని అవుషాపూర్‌లో గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి హాజరై ఆరు యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారిని పద్మిని, సర్పంచ్ కావేరిమశ్చేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, రైతు బంధు జిల్లా సభ్యుడు భిక్షపతిగౌడ్, వార్డు సభ్యులు శిరీష, శ్రీనివాస్‌గౌడ్, కుశలవరెడ్డి, వీరేశ్, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, వామన్‌రెడ్డి, వీరేందర్‌యాదవ్, కుమార్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మేడ్చల్‌లో రాస్తారోకో చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మేడ్చల్: ప్రభుత్వం ప్రకటించిన విధంగా కాకుండా మెట్రో రైల్ సర్వీసును ప్యాట్నీ నుంచి మేడ్చల్ వరకు పొడగించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. మేడ్చల్ వరకు మెట్రో రైల్ నడపాలని, మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అంశాలపై మంత్రి మల్లారెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మేడ్చల్‌లో ప్రదర్శన నిర్వహించి రాస్తారోకో చేశారు. మంత్రి మల్లారెడ్డి అసెంబ్లీలో జోకర్ మాటలు మాట్లాడకుండా ప్రజలకు పనికి వచ్చే విషయాలపై మాట్లాడాలని అన్నారు. జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి సంతోష్, నాయకులు ఆదిల్, మౌలానా, కిరణ్, రమేష్, శ్రీను, శ్రీకాంత్, అరుణ్‌ప్రసాద్, మురళీ, కృష్ణవంశీ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవం

మేడ్చల్: పిల్లల్లో నులిపురుగులను నివారించే మందులను కౌన్సిలర్ దేవరాజు మూడవ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అత్వెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పిల్లలకు అందజేశారు.

13వ వార్డులో..

వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి బాలామృతం అందజేశారు. నులిపురుగుల నివారణ మందులు, బాలామృతంను ఆయన అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

శ్రీరంగవరంలో..

మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానంద్‌రెడ్డి పిల్లలకు నులిపురుగుల నివారణ ద్రావణం అందజేశారు. నులిపురుగుల నివారణ మందులతో పాటు బాలామృతాన్ని వారు అందజేశారు. సర్పంచ్ విజయానంద్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రకాష్, కార్యదర్శి రమణారెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహ, మెడికల్ ఆఫీసర్ శైలజ, యాదయ్యగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

నులి పురుగులతో పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గుతుందని చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌ఎస్ విమలరెడ్డి, హెచ్‌ఎం అనిత, జంగయ్యయాదవ్, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కీసర, చీర్యాల గ్రామాల్లో..

కీసర, చీర్యాల గ్రామాల్లో మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో..

ప్రతి ఆరు నెలలకు ఒకసారి పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండాజోల్) వేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, సర్పంచులు తుంగ ధర్మేందర్, నాయకపు మాధురి, ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ట్రస్ట్ నిధులతో అభివృద్ధి పనులు



అవుషాపూర్ శివాలయం షెడ్డు పనులు పర్యవేక్షిస్తున్న భద్రారెడ్డి, కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో నోట్‌బుక్స్, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ఇద్దరు ప్రైవేటు టీచర్లకు నెల వేతనం రూ.17 వేలు అందజేశారు. సర్పంచ్ ఐలయ్యయాదవ్, భిక్షపతిగౌడ్, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, వీరేశ్, కుశలవరెడ్డి, నాయకులు రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి

పలుచోట్ల కేసీఆర్ చిత్రపటాలకు పెద్దఎత్తున పాలాభిషేకం



కీసర పీఏసీఎస్ కార్యాలయం వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు



అలియాబాద్ చౌరస్తా వద్ద పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కీసర: సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని మరోసారి రుజువైందని కీసర పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కీసర రైతు సహకార సొసైటీ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. పన్నాల బుచ్చిరెడ్డి, కౌకుట్ల అంజిరెడ్డి, కందాడి పోషిరెడ్డి, బిట్ల అమరావతి, తుడం సుశీల, కాంసాని మల్లారెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, మచ్చాని మల్లేష్, మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, కంసాని కమలమ్మ, కృష్ణారెడ్డి, రాగుల నరహరి, రైతులు పాల్గొన్నారు.

అలియాబాద్ చౌరస్తా వద్ద..

శామీర్‌పేట్: రైతు రుణమాఫీ చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో గురువారం శామీర్‌పేట మండలం, అలియాబాద్ చౌరస్తాలోని బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రైతుబంధు సమితి శామీర్‌పేట మండల అధ్యక్షుడు కమటం కృష్ణారెడ్డి, శామీర్‌పేట ఎంపీపీ యెల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీతో రైతులకు మేలు

ఘట్‌కేసర్: పంట రుణమాఫీ చేయాలని సీఎం నిర్ణయించడంతో పేద రైతులకు మేలు జరుగుతుందని ఎస్‌ఎఫ్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. పంట రుణమాఫీ చేయాలన్న సీఎం నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తు ఎదులాబాద్‌లో గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, జిల్లా సభ్యుడు మంకయ్య, ఎఫ్‌ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ అనంతరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, పోచిరెడ్డి, ఉప సర్పంచ్ లింగేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, చిరంజీవిముదిరాజ్, శ్రీను, బాల్‌రాజ్‌ముదిరాజ్, సత్తయ్యముదిరాజ్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్‌లో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్పొరేటర్లు గొడుగు వేణు, చిత్రాసుబ్రహ్మణ్యం, శారదామనోహర్‌రెడ్డి, సంగీతరాజశేఖర్, లావణ్యసతీష్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో పాలాభిషేకం చేస్తున్న చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు



జవహర్‌నగర్‌లో పాలాభిషేకం చేస్తున్న కావ్య, శ్రీనివాస్, కొండల్ ముదిరాజ్

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మేడ్చల్: రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో బీఆర్‌ఎస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి నాయకులు అభిషేకం నిర్వహించారు.జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నందారెడ్డి, నాయకులు దయానంద్‌యాదవ్, భాస్కర్‌యాదవ్, నర్సింహారెడ్డి, రాజమల్లారెడ్డి, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శైలజ, సురేష్‌రెడ్డి, రందీప్‌రెడ్డి, విష్ణుచారి, రాజ్‌గోపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, యూనుస్‌పాషా, వెంకటేషం, సురేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, మధుకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనాపూర్‌ను పంచాయతీగా ఏర్పాటు చేయాలి

మేడ్చల్‌రూరల్: తమ గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని మండలంలోని ఘనాపూర్, ఘనాపూర్ తండా గ్రామస్తులు గురువారం మేడ్చల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీపీఓలకు వినతి పత్రం అందజేశారు. రెండు గ్రామాలు కలిపి 1200 వరకు ఓటర్లు ఉన్నా 2018లో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయలేదని వివరించారు. గ్రామ పంచాయతీ ఏర్పాటుకు ఆదాయ మార్గాలు, కంపెనీలు, సంస్థలు అన్నీ ఉన్నాయని, జనాభా ప్రాతిపదికన తమ రెండు గ్రామాలను కలిపి గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు.

శాంతి భద్రత పరిరక్షణలో కేంద్రం విఫలం



జవహర్‌నగర్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జవహర్‌నగర్: మణిపూర్ బాధితులకు అండగా ఈనెల 6వ తేదీన నిర్వహించే అవగాహన సదస్సు కరపత్రాలను గురువారం దివ్యాంగుల ఐక్య వైదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మబ్బు బాలు ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లో ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. శాంతి భద్రత పరిరక్షణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీజేపీ పాలనలో దేశ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ నెల 6న జరిగే సదస్సుకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గొడుగు వేణు, ప్రజా సంఘాల నాయకులు ఎర్ర యాదగిరి, ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు, పద్మారావు, దర్శనం యాదగిరి, యాకస్వామి, ఎల్లయ్య, ఎండీ.పాషా మియా, అహ్మద్‌ఖాన్, సావిత్రి, ప్రకాష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

భూమి కేటాయించి న్యాయం చేయాలి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనుల్లో భూమి కోల్పోతున్న బాధితులకు గతంలో ఇచ్చిన పట్టా సరిఫికేట్ల ఆధారంగా భూమి కేటాయించి న్యాయం చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి గురువారం వినతి అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ నర్సింగ్‌రావు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌చైన్ సాంకేతిక నైపుణ్యంతో ఉజ్వల భవిష్యత్



అవగాహన సదస్సులో ముఖ్య అతిథితో విద్యార్థులు

ఘట్‌కేసర్: బ్లాక్ చైన్ సాంకేతిక నైపుణ్యం ఉన్నవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఐబీసీ మీడియా ప్రతినిధి అవినాశ్‌రెడ్డి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో బ్లాక్‌చైన్ టెక్నాలజీపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన బ్లాక్‌చైన్ టెక్నాలజీని వినియోగించుకుంటే అనేక సాంకేతిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. బ్లాక్‌చైన్ సాంకేతికను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. డీన్‌లు విజయ్ కుమార్, విష్ణుమూర్తి, డాక్టర్ శివప్రసాద్, వినయశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.